# అనువాద కథ



— జ్యోత్స్న

ఒక సినిమాలో సన్నివేశంలా 'అతడు' ఫ్యాక్టరీలో చేరాడు. ఫ్యాక్టరీలో చాలా కాలంగా పాడై ఉన్న ఒక మిషన్ని కేవలం డిగ్రీలతోనే ఇంజనీర్లయిన కొందరు బాగు చేయలేక చేతులెత్తేస్తే, డిగ్రీతో పాటు తెలివి తేటలు కూడా ఉన్న 'అతడు' దాన్ని బాగు చేసి యజమాని అభిమానాన్ని పొందాడు.

అతని 'స్థాయి' కి తగ్గ ఉద్యోగమే ఇస్తానన్నాడు యజమాని. మనుషులకు దగ్గరగా ఉండే 'ఉద్యోగం' అతడు కోరుకున్నాడు. యజమాని అంగీకరించి ఇచ్చాడు. ఆ ఫ్యాక్టరీలో 'అతడు' సూపర్‌వైజర్‌గా చేరాడు. చేరిన కొద్ది రోజుల్లోనే కార్మికుల్లో ఒకడిగా వారి కష్టనష్టాలు, ఆనందాలు పంచుకునే ఆత్మీయుడిగా చేరువైపోయాడు.

* * * * * *

ప్రతి బుధవారం ఆ ఫ్యాక్టరీని సందర్శించి అందర్నీ అన్నింటిని పరిశీలించడం ఫ్యాక్టరీ యజమానికి అలవాటు. ఓ బుధవారం అలాగే ఫ్యాక్టరీలో అడుగుపెట్టాడు. లోపలికి ప్రవేశించిన దగ్గర్నుంచి బయట కొచ్చేంతవరకూ అతనికి 'నమస్కారం సార్!' 'దండాలయ్యా!', 'నమస్తే సార్!' 'దండాలు బాబూ!' అంటూ ప్రతి ఒక్కరూ వంగి వంగి సలాములు కొట్టారు. ఒక్క అతడు తప్ప. తన పనో తదేక దీక్షతో చేసుకుంటూ యజమాని రాకను సైతం అతడు గుర్తించలేదు.

* * * * * *

తక్కువ ఖర్చుతో వచ్చే ఒక మిషన్‌ని అదనంగా కొనుగోలు చేసి ఫ్యాక్టరీలో ఒక యూనిట్‌కు అమర్చితే ఇంకా తక్కువ ఖర్చుతో ఉత్పత్తి ఎలా చేయవచ్చు 'అతడు' ఓ రోజు యజమానిని కలసి వివరించాడు. అతడి తెలివితేటలకు యజమాని ఆశ్చర్యపోయాడు. మిషన్ కొని యూనిట్‌ను అమర్చాడు.

ఉత్పత్తి ఖర్చు తగ్గింది. లాభాలు పెరిగాయి. యజమాని అతని ఉద్యోగ స్థాయి పెంచుతానన్నాడు. 'అతడు' అంగీకరించలేదు.

* * * * * *

బుధవారం వచ్చింది.

యజమాని ఫ్యాక్టరీని సందర్శిస్తున్నాడు. 'అతడు' ఒక మిషన్ దగ్గర దీక్షగా పని చేస్తున్నాడు. అతని చుట్టూ ఉన్న వాళ్లు యజమాని రాకను గుర్తించి వంగి, వంగి, సలాములు చేశారు. అతడు గుర్తించలేదు. యజమానే వెళ్లి అతడ్ని పలకరించాడు. అతడు యజమాని వైపు ఒకసారి చూసాడు. సాధారణంగా యజమాన్ని చూసి ఉద్యోగి ఒక విధమైన భయంతో కంగారుపడుతుంటాడు. కానీ, ఇక్కడ యజమానే అతడి ముఖం చూసి కంగారు పడ్డాడు. అతడిలో ఏదో మార్పు. ముఖంలో ఏదో బాధ!....కాదు అసంతృప్తి.....ఆ కళ్లలో అసంతృప్తి కనబడుతోంది. ఆ అసంతృప్తికి కారణమేమిటో.....?

* * * * * *

ప్రతీ బుధవారమే కాదు యాదృచ్ఛికంగా యజమాని బయట ఎక్కడ తారసపడినా అతడో యజమానిని గౌరవించడం లేదు. రోజురోజుకి 'అతడి'లో మార్పు వస్తోంది. యజమాని ఆ మార్పును గమనిస్తున్నాడు. అతడి కళ్లలో అసంతృప్తితో పాటు ఇప్పుడు అతని మాటల్లోను, చేతల్లోను కూడా ఓ విధమైన బాధ, చిరాకు వ్యక్తమౌతున్నాయి. కార్మికుల్లో మాత్రం అతడంటే అభిమానం బాగా పెరిగింది.

అతని అసంతృప్తికి,బాధకి, కారణం కనుక్కుందామని యజమాని ఓ రోజు అతన్ని పిలిచి అడిగాడు.

'ఏమిటి నీ బాధ?'

'ఆకలి'

'వ్వాట్! జీతం సరిపోవడం లేదా?'

'ఎవ్వరికీ సరిపోవడంలేదు'

'నేనడుగుతున్నది నీ గురించి'

'నే చెబుతున్నదీ మాగురించే'

'నీ జీతం పెంచమంటావా?'

'నా ఒక్కడి జీతం పెంచితే అందరి ఆకలి తీరదు'

'అందరి జీతాలు పెంచాలంటే....యజమాని ఏదో అనబోయాడు.

మిషన్లునలా ఉంచే తక్కువ ఖర్చుతో ఉత్పత్తి పెంచవచ్చో చెప్పాను. లాభాలొచ్చాయి. ఉత్పత్తి ఇంకా పెరగాలంటే కార్మికులు ఎంత ఆనందంగా ఉండాలో ఇప్పుడు చెబుతున్నాను' అంటూ అతడు యజమానికి ఒక కాగితం అందించాడు. అందులో ఆ ఫ్యాక్టరీలో ఉద్యోకుల ఇబ్బందుల గురించి, వారి అభివృద్ధికి యాజమాన్యం చేపట్టవలసిన కార్యక్రమాలు, వాటి కయ్యే ఖర్చుల వివరాలు రాసి ఉన్నాయి.

యజమాని అది చూసి ఏదో అనబోయాడు.

'అతడే' అడ్డుపడి అన్నాడు 'ఇప్పుడు మీరు చేయాల్సింది ఒకటే' ఆ కాగితంలోని కోర్కెలను ఆమోదించడం లేదా నన్ను పనిలోంచి తొలగించడం!....అది నన్ను తొలగిస్తే కార్మికుల్లోంచి నాలా మరో కార్మికుడు పుట్టుకురాడన్న నమ్మకం మీకుంటే......' అతడు యజమాని దగ్గర్నుంచి వెళ్లిపోయాడు.

ఆ రోజు రాత్రంతా యజమాని బాగా ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చాడు. అతడ్ని పనిలోంచి తొలగించాలని కాదు. అతడిచ్చిన కాగితంలోని కోర్కెలను అంగీకరించాలని.

* * * * * *

కథ ముగిసింది.!!

కథ చివరి వాక్యం చదివి 'రేపటితరం' పత్రిక ఎడిటర్ ఉలిక్కిపడ్డాడు! నాన్సెన్స్! ఏమిటీ ముగింపు రచయితగారూ! ఇలా ఎక్కడైనా జరుగుతుందా? ఎదురుగా కూర్చున్న రచయితను అడిగాడు ఎడిటర్.

'జరగదంటారా?' ఎడిటర్ ముఖంలోకి తీక్షణంగా చూస్తూ అడిగాడు ఎదురుగా కూర్చున్న ఆ కథా రచయిత.

'ఛస్తే జరగదు! మన దేశంలో జరగదుగాక జరగదు!! ఖచ్చితంగా బల్లగుద్ది చెప్పాడు 'రేపటితరం' ఎడిటర్.

'ఏ దేశంలో అయితే అలా జరుగుతుందో ఆ దేశపు అనువాద కథగా ఈ కథ అచ్చెయ్యండి!' అంటూ అక్కడ్నించి లేచి వెళ్లిపోయాడు రచయిత.